

అద్వైత వేదాంతాన్ని సుప్రతిష్ఠితం చేసి ప్రచారం చేసిన శ్రీ ఆదిశంకరభగవత్పాదులు సాక్షాత్తూ శివావతారమే. శ్రీవారు పరమపూజ్యమైన శ్రీ శృంగేరి శారదాపీఠాన్ని ప్రతిష్ఠించారు. శ్రీ శారదాపీఠం శ్రీ శంకరుల నుండి అవిచ్ఛిన్న గురుపరంపరతో అలరారుతున్నది. ఆ గురుపరంపరలోని గురుమూర్తులందరూ దివ్య దీప్తులతో ప్రకాశించే జ్ఞానమూర్తులు. కరుణావరుణాలయులు. ఈ సచిత్ర గ్రంథరాజం, ఆ శృంగేరీ శారదాపీఠ గురుపరంపరలో ముప్పది ఆరవవారైన, శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వాముల వారి జీవనరేఖలను, బోధనలసారసంగ్రహాన్నీ తెలియజేయటానికై రూపొందుతున్నది.



ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణామండలం ముఖ్యపట్టణమైన మచిలీపట్నంలో
బ్రహ్మశ్రీ వేదమూర్తులు తంగిరాల వేంకటేశ్వరావధాని, శ్రీమతి అనంతలక్ష్మమ్మ
అనే పుణ్యదంపతులు ఉండేవారు. ఆ దంపతులు తమకొక జ్ఞానమూర్తియైన పుత్రుణ్ణి
ప్రసాదింపవలసినదిగా తమ ఇష్టదైవాలను ప్రార్థించారు.



బ్రహ్మశ్రీ వేంకటేశ్వరావధాని గారు ప్రతి సంవత్సరం శ్రీరామనవరాత్రోత్సవాలను అత్యంతభక్తి శ్రద్ధలతో ఆచరించేవారు. శ్రీవారు ఒక సంవత్సరం తమకు ఒక పుత్రరత్నం కలిగితే సీతారామ నామధేయం పెట్టుకుంటామని మ్రొక్కుకున్నారు.



శ్రీమతి అనంతలక్ష్మమ్మ గారు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆంజనేయస్వామి వారిని పూజించేవారు. తన కడుపున ఒక కొడుకు పుడితే ఆంజనేయస్వామీ! నీపేరు పెట్టుకుంటానని ఆమె మ్రొక్కుకున్నది.



ఒక దినం రాత్రి ఆమెకు కలలో ఆంజనేయస్వామి వారు
దర్శనం అనుగ్రహించి పరమవాత్సల్యంతో ఇవిగో మూడు మామిడిపండ్లు
గ్రహించు అని ఆమె చేతిలో పెట్టారు.



వెంటనే ఆమె పతిదేవునితో, ఆంజనేయస్వామి వారు
నన్ను కలలో అనుగ్రహించారు. మన కోరిక త్వరలో
తీరుతుందని నివేదించారు.



ప్రభువు వారిద్దరి ప్రార్థనలను మన్నించారు. ఖర నామసంవత్సర చైత్ర శుక్లషష్ఠి నాడు మృగశిరానక్షత్రయుక్త శుభదినాన ఆ పుణ్యదంపతులకు పుత్రుడు జన్మించాడు. (1951 ఏప్రిల్ 11న).



ఒక పవిత్ర శుభదినమున ఆ దంపతులు ఆ బాలునకు సీతారామాంజనేయులు అని నామకరణం చేశారు. ఆ కుటుంబం శ్రీ సీతారామాంజనేయులు జన్మించిన తరువాత గుంటూరు మండలంలోని నరసరావుపేటకు చేరుకున్నది.



పసితనంలోనే శ్రీ సీతారామాంజనేయులు తమ భావిమహోన్నత వైభవం సూచనలను ప్రకటించారు. శ్రీమతి అనంతలక్ష్మమ్మ గారు ఒక ప్రాత:కాలంలో బాలునిముఖం దివ్యదీప్తులతో వెలుగొందటం గమనించింది.  ఓహో! పిల్లవాని ముఖం ఎంత ప్రకాశవంతంగా ఉంది.



శ్రీ సీతారామాంజనేయులు మూడు సంవత్సరాల ప్రాయంలో
ఉండగా ఒకనాడు ఓదార్చటానికి కూడా శక్యం కానివిధంగా ఏడుస్తున్నారు.



అయ్యో! నేను సముదాయించలేకపోతున్నాను. అనుకొంటూ తల్లి దగ్గరలో ఉన్న శివాలయానికి తీసుకొని వెళ్ళారు. శివాలయంలోనికి అడుగుపెట్టిన వెంటనే పిల్లవాడు ఏడుపు మానివేశాడు. శంభో శివ శివ సాంబ శివ శివ అని జపించటం మొదలుపెట్టాడు.



ఒకనాడు శ్రీ ఆంజనేయులు ఇంటిలో తల్లికి కనిపించలేదు.
ఆమె కంగారుపడుతూ బాలుని కోసం వెదకటం ప్రారంభించారు.
మా అబ్బాయి కనపడ్డాడా అని అందరినీ అడగసాగారు.



చివరకు ఆమె పిల్లవానిని దగ్గరలో ఉన్న ఆంజనేయస్వామివారి
ఆలయంలో ఆడుకుంటూ ఉండటం చూచి, ఇదేమయ్యా ! ఇక్కడ ఏమి
చేస్తున్నావు నేను చాలా కంగారు పడిపోయాను అన్నారు. అమ్మా !
కంగారెందుకమ్మా ! ఏదైనా పొరపాటు జరిగిందా? నేనిక్కడ శంభో శివ
శివ అని జపం చేసుకుంటున్నాను. అన్నారు శ్రీ సీతారామాంజనేయులు.



శ్రీ అవధాని గారు బాలునకు పురాణాల నుండి ఇతిహాసాలనుండి మంచి మంచి ఘట్టాలు చెప్తూ ఉండేవారు. ఒకసారి విన్న కథ బాలుని హృదయంలో హత్తుకొనిపోయేది. "ధర్మమూర్తి శ్రీరామచంద్రుడు క్రూరాత్ముడు రావణుణ్ణి యుద్ధంలో నాశనం చేశాడు".



శ్రీ ఆంజనేయులు చాలా చిన్నతనంలోనే ఒక విద్వాంసుని దగ్గర సంస్కృతం అధ్యయనం చేయటం ప్రారంభించారు. అతి శీఘ్రకాలంలోనే సంస్కృతంలో ధారాళంగా ప్రసంగిచటం అలవడినది.



శ్రీ ఆంజనేయులు ఏడవయేట ఉండగా తల్లిదండ్రులు ఆ బాలునకు ఉపనయన సంస్కారం సలక్షణంగా చేశారు.



శ్రీ ఆంజనేయులు సంధ్యావందనాది నిత్యకర్మములను నిష్ఠతో నేర్చుకుని ఆచరించినారు. మంత్రపాఠములో అత్యంత శ్రద్ధతో ఉండేవారు. బ్రహ్మచారికి స్మృతులు విధించిన నియమములను అత్యంత నిష్ఠతో పాటించేవారు. గాయత్రీ మంత్రజపంలో గొప్ప ఆనందం అనుభవిస్తూ ఉండేవారు.



**శ్రీ ఆంజనేయులు** యజుర్వేదాన్ని తండ్రిగారి యొద్దనే అధ్యయనం చేశారు. వారు 'ఏకసంథాగ్రాహి' అని నిరూపించుకొన్నారు. (ఒక్కమారు గురువు చెప్పిన దానిని ధారణలో నిలుపుకోవటమే ఏకసంథాగ్రాహిత్వం). శుభం. నేనీ అనువాకాన్ని ఒక్కమారు మాత్రమే నీకు బోధించాను. అయినా నీవు దానిని ధారణలో నిలుపుకొని మళ్ళీ అనువదించగలుగుతున్నావు, అదే ఒక్క తప్పు కూడా దొరలకుండా అనే వారు శ్రీ అవధానిగారు. అవధానిగారు కొందరు ఆత్మీయుల గృహాలలో ఉపనయనం మొదలైన సంస్కారాలు చేయిస్తూ ఉండేవారు. శ్రీ ఆంజనేయులు వారితో పాటు వెళ్ళిఆ కార్యక్రమ విధానాదులను అనుశీలిస్తూ ఉండేవారు. తాము కూడా ఆ విధులలో సహాయపడుతూ ఉండేవారు.




చాలా కొద్ది కాలంలోనే **శ్రీ ఆంజనేయులు** కృష్ణయజుర్వేదంలో పరిపూర్ణ పాండిత్యం సాధించారు. విద్వత్పరీక్షలలో ప్రశంసాపూర్వకమైన ఉత్తీర్ణతను గడించారు. గుంటూరు మండల వేదప్రవర్ధక విద్వత్పరీక్షలో సర్వోత్తమస్థితిని సంపాదించారు.




తొమ్మిదియేండ్ల వయస్సులో ఉన్నప్పుడే పరిశుద్ధమైన సంస్కృతములో శ్లోకాలు రచించారు. సంస్కృత వక్తృత్వస్పర్ధా సమావేశాలలో పాల్గొని పెక్కు పురస్కారాలు అందుకొన్నారు.



ఒకనాడు ఒక వ్యక్తి అవధాని గారి కోసం వచ్చాడు. ఆంజనేయులుగారూ! నాన్నగారెక్కడ ? ఈరోజు నా కుమారుని ఉపనయనం. దానిని చేయించటానికి నాయనగారు ఒప్పుకొన్నారు - అన్నాడు. శ్రీ ఆంజనేయులు - నాయనగారు గ్రామంతరం వెళ్ళారు. మీరు కంగారుపడకండి. మీ యింట్లో కార్యక్రమానికి వారు తప్పక తిరిగి వస్తారు - అని చెప్పారు.



కానీ అవధానిగారు సమయానికి తిరిగి రాలేకపోయారు. వెంటనే శ్రీఆంజనేయులుగారు నడుము కట్టుకొని ఆ ఉపనయన సంస్కారానికి ఋత్విక్కులై సలక్షణంగా చేయించారు. ఓహో ! ఈ చిన్ని బాలుడు ఆ సంస్కారవిధిని ఎంత నిర్దుష్టంగా నిర్వహించాడు ! అనుకొన్నారు విజ్ఞులందరూ.



**శ్రీఆంజనేయులు** అప్పటివరకు తండ్రిగారు ఆ సంస్కారాన్ని చేయిస్తూ ఉంటే రెండుమూడుమార్లు మాత్రం కేవలం చూచి ఉన్నారు. నాన్నా! నిన్ను చూచి గర్వపడుతున్నాను. నీవు నామాట నిలబెట్టటమే కాదు – సంస్కారవిధిని చాలా చక్కగా చేయించావు – ఇదీ తండ్రిగారి పరితృప్తితో కూడిన ప్రశంస.



శ్రీ శృంగేరీ శారదాపీఠం ముప్పది అయిదవ పీఠాధిపతులు జగద్గురు శ్రీ అభినవవిద్యా తీర్థ మహా స్వామి వారు 1961లో విజయవాడకు విచ్చేశారు.
శ్రీవారు ధర్మాచరణలో ప్రమాణభూతంగా నిలువగలవారు. వైదిక విద్యాసంబంధమైన వాఙ్మయంలో సాటిలేని ప్రామాణికులు.
సుసంపన్నులైన యోగిరాట్టు ఆదర్శప్రాయమైన జీవన్ముక్తులు. కరుణావరుణాలయులు.



విజయవాడలోని ఒక విద్వాంసుడు తనతో పాటు శ్రీ ఆంజనేయులు గారిని జగద్గురువుల సన్నిధికి తీసుకొని వెళ్ళి పరిచయం చేశారు. మహాస్వాములవారూ! ఈ చిరంజీవి సంస్కృతంలో ధారాళంగా ప్రసంగించగలడు.



శ్రీ జగద్గురువులు చిరంజీవితో సంస్కృతంలో సంభాషింపనారంభించారు.

శ్రీవారు బాలునకు సంస్కృతభాషపై ఉన్న పాటవానికి ముగ్ధులయ్యారు.  అతని నిర్దుష్టమైన వేదపఠనానికి ఆనంద పరవశులయ్యారు.



జగద్గురువులు చిరంజీవి శ్రీ ఆంజనేయులుకు పట్టుశాలువా బహూకరించారు.

దివ్యదృక్షసారాన్ని అనుగ్రహించారు.



శ్రీ ఆంజనేయులు జగద్గురువుల కృపావర్షానికి

పరవశించిపోయారు.

"తమరే నా సద్గురువులు. నా సంరక్షకులు తారణకర్తలు.



మరొకమారు జగద్గురువులు నరసరావుపేటకు వేంచేసినప్పుడు చిరంజీవి ఆంజనేయులు శ్రీవారిని దర్శించుకొన్నారు. జగద్గురువులు అతనితో సంస్కృతంలో సంభాషించారు.



జగద్గురువులు నా పై కురిపించిన అనుగ్రహం అవధులు లేనిది. శ్రీవారి దివ్యసాంనిహిత్యం నాలో కలకాలం నిలిచిపోతుంది. నేను శ్రీవారి సంరక్షణలో మార్గదర్శనంలో ఉన్నాను అనే విషయం ఋజువైంది.



**శ్రీ ఆంజనేయులు** తమ లౌకికవిద్యను నరసరావుపేటలోని పురపాలక ఉన్నత పాఠశాలలో సాగించారు. శిఖతో, పంచెకట్టుతో వారు తరగతులకు వెళ్ళేవారు. ప్రజ్ఞాప్రాభవాలున్న విద్యార్థి కనుక తరగతిలో అవిచలితంగా ప్రప్రథములుగా ఉండేవారు.



కాలక్రమేన ఆ పాఠశాల ఆంగ్ల మాధ్యమంలో బోధనను ప్రవేశపెట్టింది. దీనివలన చాలామంది విద్యార్ధులు ఇతర పాఠశాలలకు వెళ్ళిపోయారు.

“మేమిక్కడ ఆంగ్ల మాధ్యమంలో మంచిమార్కులు తెచ్చుకోలేము. వేరే తెలుగు మాధ్యమ పాఠశాలలకు వెళ్ళిపోతాం” అనుకొన్నారు.



ఆంజనేయులూ ! నేను నిన్ను వదలను. నాకు తెలుసు. నీవు ఆంగ్లమాధ్యమంలో కూడా రాణిస్తావు. ఇక్కడే చదువుకో ! – అన్నారు ప్రధానోపాధ్యాయులు. శ్రీ ఆంజనేయులు అలాగే అన్నారు. ప్రధానోపాధ్యాయుని భావన సరియైనదే. శ్రీ ఆంజనేయులు అక్కడనే చదువును, చక్కని పురోగతినీ కొనసాగించారు.



శ్రీ ఆంజనేయులు ప్రయోజనాత్మక వ్యవహారాలలోనే నిమగ్నులై ఉండేవారు. వానిలో నిత్యకర్మానుష్ఠానము, వేదాధ్యయనము, సంస్కృతాధ్యయనము, పాఠశాలకు వెళ్ళుట, చిత్తశుద్ధితో అధ్యయనం చేయటం, దేవమందిరాలను సందర్శించటం, తల్లిదండ్రులకు శుశ్రూష చేయటం అనేవి ప్రధానమైనవి.



క్రమక్రమంగా శ్రీ ఆంజనేయులుగారిలో లౌకికవిద్యలపట్ల విరక్తీ, శాస్త్రాధ్యయనం పైన అనురక్తీ పెరుగసాగాయి. “నాకీ ప్రాపంచికమైన చదువుల మీదా, సాధనల మీదా మోజు కలగటం లేదు. నా హృదయం వైదిక విద్యల వైపు పరువెత్తుతున్నది.”



1966 ఫిబ్రవరిలో శ్రీ శృంగేరీ జగద్గురువులు నరసరావుపేటను సందర్శించారు.

శ్రీ ఆంజనేయులు జగద్గురువుల దర్శనం చేసుకున్నారు. కొన్ని నెలల లోపుననే

శ్రీ ఆంజనేయులు జీవితాన్ని మార్చివేసే నిర్ణయం తీసుకొన్నారు.




"నా గురుదేవుల శరణం పొందటానికి సమయం ఆసన్నమైనది. శ్రీవారి దివ్యానుగ్రహం వలననే నేను జీవితలక్ష్యం సాధింపగలుగుతాను." ఇలా నిర్ణయించుకొని శ్రీ జగద్గురువులు అప్పుడు చాతుర్మాస్యవ్రతం చేయబోతున్న ఉజ్జయినికి చేరుకోవటానికి నిశ్చయించుకొని విజయవాడలో బండియెక్కారు.



**1966 జులై మొదటి తేదీ నాడు శ్రీ ఆంజనేయులు ఉజ్జయినికి చేరుకొన్నారు.**
**శ్రీ జగద్గురువుల శ్రీ చరణాలకు సాష్టాంగదండ ప్రణామం చేశారు.**



"ఓహ్ ! సంస్కృత సంభాషణ చతురతగల బాలుడు! నీవిక్కడికి ఏమి పని మీద వచ్చావు?" "గురుదేవా ! నేను మీ పాదాలవద్ద శాస్త్రాలు అధ్యయనం చేయాలనే దృఢసంకల్పంతో వచ్చాను". "అలాగా ! అయితే నీవు ఇక్కడ ఉండవచ్చు. మేము నీకు బోధిస్తాము".



ఉజ్జయినిలో శ్రీ గురువుల పాదసన్నిధిలో, జీవితపరమలక్ష్యం సాధించటానికి ఉన్నాను. మీరు కంగారు పడకండి -అని తల్లిదండ్రులకు ఉత్తరం వ్రాశారు.



పరమపూజ్య జగద్గురువులు శ్రీ ఆంజనేయులుగారిని తమ సన్నిధిలోనికి తీసుకున్నారు.

న్యాయశాస్త్రానికి సంబంధించిన ఒక గ్రంథాన్ని బోధించటం ప్రారంభించారు.



ఉజ్జయిని నుండి జగద్గురువులు మరికొన్ని భారత భూభాగాలకూ, నేపాల్ దేశానికీ సంచారం సాగించారు. శ్రీ ఆంజనేయులును తమతోపాటే సంచరించటానికి అనుగ్రహించారు. ఆ యాత్ర క్రొత్త ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, భాగ్యనగరము, బెంగుళూరు మొదలైన మహానగరాలనూ, మధుర, బృందావనము, కురుక్షేత్రము, నైమిశారణ్యము, అయోధ్య, ఖాట్మండు, తారకేశ్వరము, గయ, ప్రయాగ, వారణాసి, హరిద్వారము, ఋషికేశము, కేదారనాథ్, జ్యోతిర్మఠము, బద్రీనాథ్, శ్రీనగరము, పంచవటి, నాసిక, శ్రీశైలము, హంపి మొదలైన పుణ్యక్షేత్రాలను కలుపుకొంటూ సాగింది.



శృంగేరీకి తిరిగి వచ్చిన తరువాత జగద్గురువులు శ్రీ ఆంజనేయులుకు న్యాయశాస్త్రగ్రంథాలను బోధించటానికి పేరు ప్రఖ్యాతులున్న ఒక విద్వాంసుణ్ణి ఏర్పాటు చేశారు. ప్రతి సాయంకాలమూ  శ్రీ ఆంజనేయులు ఉదయం నేర్చుకున్న పాఠాలను గురువుగారికి నివేదించుకొంటూ ఉండేవారు. అది చూచేవారికి శ్రీ ఆంజనేయులు గారే ఆ విద్వాంసులకు బోధిస్తున్నారా అనిపించేది. వారి గ్రహణశక్తీ, నివేదశక్తీ అంత గొప్పవి.



జగద్గురువులు శిష్యునిపట్ల పరమవాత్సల్యంతో ఉండేవారు. ఎప్పటికప్పుడు అతని పురోగతికి చక్కని బాటలు వేస్తూ ఉండేవారు. శ్రీవారు తమంతటతామే శ్రీ ఆంజనేయులు గారికి న్యాయశాస్త్ర సంబంధమైన ఉన్నత స్థాయి గ్రంథాలను బోధించేవారు.



శ్రీ జగద్గురువులు శిష్యుణ్ణి యోగాసనాలను అభ్యసింపవలసినదిగా,
ప్రాణాయామమును చేయవలసినదిగా పురికొల్పారు.



**బ్రహ్మచారి** తన పరిచయంలోనికి వచ్చిన అందరి హృదయాలను తమ యోగాభ్యాస్యాదులచేత ఆకట్టుకొన్నారు. వారు గాఢమైన ప్రాపంచిక విషయాల విరక్తినీ, వినయ ప్రవృత్తినీ పెంపొందించుకొన్నారు.



శ్రీ శారదాపీఠ భక్తులు అప్పుడప్పుడూ ఈ బ్రహ్మచారికి ఏవేవో కానుకలూ, దక్షిణలూ ఇచ్చుకోవాలని ఉబలాటపడేవారు. కానీ నిత్యసంతృప్తులు, విరక్తచిత్తులూ అయిన శ్రీ ఆంజనేయులు వానిని స్వీకరించేవారు కాదు. “మీ ఉద్దేశం అభినందించదగినదే. కానీ నేను మీ సమర్పణలను తీసుకోలేను, ఎందుకంటే నాకు ఏ అవసరాలూ లేవు”.



శృంగేరీలో జరిగే మహాగణపతి వాక్యార్థ విద్వత్సభలో ఈ బ్రహ్మచారి చేసిన అత్యద్భుత ప్రవచనం అందరినీ ఆకట్టుకొన్నది. "ఈ బాలవిద్వాంసుడు శాస్త్రార్థాన్ని ఎంత చక్కగా విశదీకరిస్తున్నాడు ! శ్రీశారదాంబా, శ్రీ జగద్గురువుల దివ్యానుగ్రహమే ఈ బాలుణ్ణి విద్వద్వరేణ్యునిగా చేసింది".



ఒకనాడు జగద్గురువులు శారదాంబా మందిరంలోని గర్భాలయంలోనికి ప్రవేశించారు.
కొంతసేపు ధ్యానంలో ఉండిపోయారు. వెలుపలికి వచ్చి ప్రకటించారు. "శారదాంబ అమ్మవారు అనుమతించారు.
మేము చిరంజీవి సీతారామంజనేయులు గారిని మాకు ఉత్తరాధికారిగా ఎన్నుకొన్నాము. నియోగిస్తున్నాము" .



శాస్త్రనిర్దేశాలను బట్టి సంన్యాసదీక్ష తీసుకోవటానికి పూర్వదినాన,
ప్రతిపాదితవ్యక్తి ఉపవాస దీక్షలో ఉండాలి. ఆ రాత్రి జాగరణ చేయాలి.



1974 నవంబరు 11 వ తేదీన శ్రీజగద్గురువులు
శ్రీ ఆంజనేయులు గారికి సంన్యాసదీక్షను అనుగ్రహించారు.



అప్పుడు శ్రీ జగద్గురువులు నూతన సంన్యాసికి ప్రణవమంత్రాన్నీ మహావాక్యాలనూ ఉపదేశించారు.

భారతీతీర్థ అనే యోగపట్టమును ప్రసాదించారు.



తరువాత కొన్ని దినాలు శ్రీ జగద్గురువులు స్వయంగా క్రొత్తగా సంన్యాసదీక్షలోనికి అడుగుపెట్టిన శ్రీ భారతీతీర్థులవారికి నిత్యము పాటించవలసిన ధర్మాచారాలను బోధించారు. అలాగే నారసింహ, దక్షిణామూర్తి, శ్రీవిద్యామంత్రాలను ఉపదేశించారు. మరికొన్ని మంత్రాలను కూడా ఉపదేశించారు. జగద్గురువులు శ్రీవిద్యా మంత్రోపదేశం చేస్తున్నప్పుడు ఒక అత్యద్భుత సంఘటన జరిగింది. “స్వామీ ! మీరు చాలా అదృష్టవంతులు. మేము ధ్యాన శ్లోకం పఠిస్తూ ఉండగా అమ్మవారి దివ్యదర్శనం మాకు లభించింది. చాలా శక్తిమంతంగా మేము సమాధిలోనికి వెళ్ళిపోయాము.



ఒకనాడు మేము శారదాంబ దర్శనం చేసుకొన్న తరువాత ఆలయం నుండి వెలుపలికి వస్తూ ఉన్నాము. మేము అమ్మవారి ముందు సాష్టాంగదండ ప్రణామం చేస్తున్నాము. అది కాయమునకు సంబంధించిన చర్య. అంతరంగంలో శ్రీశంకర భగవత్పాదులు ఉపదేశించిన పరమసత్యాన్ని జపిస్తూ ధ్యానిస్తూ ఉండాలి. నిజానికి అదే మానవుని జీవితాన్ని సఫలం చేస్తుంది.



వేదాంతశాస్త్రం సువ్యవస్థితంగా నిరూపించిన పరమసత్యాన్ని జగద్గురువులు, పరమ పూజ్యులు శ్రీ భారతీ తీర్థస్వామి వారికి, లోతు పాతులన్నీ అవగతమయ్యే విధంగా ప్రతిబోధించారు.




1979వ సంవత్సరంలో చారిత్రాత్మక వేదాంత తత్త్వ శిఖరాగ్రసభ శృంగేరీలో జరిగింది. అందులో ఆదిశంకరులు ప్రతిష్ఠించిన నాలుగు ఆమ్నాయపీఠాల మహాస్వాములు పాల్గొన్నారు. అందులో ప్రగాఢంగా చర్చకు వచ్చిన విషయం ఆధ్యాత్మిక జ్ఞానసంపద.



ఆ అవిస్మరణీయ సంఘటనలో శ్రీ భారతీ తీర్థమహాస్వాముల వారు
పరమసుందరమైన సంస్కృత భాషలో చేసిన అనుగ్రహభాషణం సమావేశానికి
విచ్చేసిన శంకరాచార్యులను, భక్తులను ఎంతగానో ఆకట్టుకొన్నది.



పరమపూజ్యులు శ్రీభారత తీర్థస్వామివారు తమ గురువులను గూర్చి ఆశువుగా రెండు శ్లోకాలు రచించి ప్రకటించారు. మొదటి శ్లోకంలో తమ గురువులు మానవాకారంలో అవతరించిన సాక్షాత్ పరబ్రహ్మమే అని నిరూపించారు. రెండవ శ్లోకంలో తమ గురుదేవులు నిర్వికల్పసమాధిలో లీనమై ఉన్న స్థితిని అత్యద్భుతంగా చిత్రీకరించారు. శ్రీవారిని యోగీశ్వరులుగా అభివర్ణించారు. మరల మరల పుట్టడం అనే బంధనదశ నుండి విముక్తిని పొందటానికి మేము పరమ గురుమూర్తిని ధ్యానిస్తున్నాము. శ్రీవిద్యాతీర్థమహాస్వాములవారి మనస్సు నిరంతరము పరమబ్రహ్మము నందే లగ్నమై ఉంటుంది. సచ్చిదానందాత్మక తత్త్వమందే లీనమై ఉంటుంది. అందువలననే వారు నిర్వికల్ప సమాధిలో ఉండగలుగుతున్నారు.



సనాతనధర్మ సంరక్షణ, ప్రచారములు పరమలక్ష్యంగా పెట్టుకొని **శ్రీజగద్గురువులు** అనేక ప్రదేశాలకు యాత్రలు చేశారు. శ్రీవారు తమతోపాటు **శ్రీ భారతతీర్థులను** గూడ వెంటబెట్టుకొని వెళ్ళేవారు. శ్రీ ఆంజనేయులు గారిని ఉత్తరాధికారిగా ప్రకటించి సంన్యాసదీక్ష అనుగ్రహించిన తరువాత మొట్టమొదటిసారిగా **1975లో రామేశ్వరక్షేత్రంలోని శ్రీరామనాథస్వామి** ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమానికి తీసుకొనివెళ్ళారు. అటుపిమ్మట **1977**లో వారణాసిలోని అన్నపూర్ణాలయ మహాసంప్రోక్షణ కార్యక్రమానికి తీసుకొని వెళ్ళారు. ఈ రెండు సంవత్సరాలలో భారతదేశ సంపూర్ణయాత్ర జగద్గురువులు నిర్వహించారు. ప్రతిప్రదేశంలో **శ్రీజగద్గురువులు**, శిష్యస్వాములైన జగద్గురువులు చేసిన అద్భుతపరమార్థ సంబంధ ప్రసంగాలు శ్రోతృజనాల సముద్ధరణకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.



1980 లో శబరిమల యాత్రకు వెళ్ళిన సందర్భంలో పరమపూజ్యులు ఆశువుగా ఒక స్తోత్రాన్ని విరచించారు. అందులో ఒక శ్లోకం తాత్పర్యం ఇలా ఉన్నది. ఆహా! ఈ దివ్యమూర్తులిద్దరు ఏకకాలంలో జగత్సంక్షేమం కోసం ఇక్కడ కలుసుకొన్నారు. ఒకరు సంన్యాసి సార్వభౌములు అస్మద్గురువరేణ్యులు. మరొకరు ఇక్కడే దేవతామూర్తిగా సాక్షాత్కరించి ఉన్న ధర్మశాస్త్ర ధర్మ సంరక్షకుడు.



తమ గురువుల ఆదేశానుసారం **శ్రీపరమపూజ్య ఆచార్యవర్యులు** స్వతంత్రంగా **1983 నుండి విజయయాత్రలు** చేయటం ప్రారంభించారు. పరమపూజ్యులు తమ గురుదేవులకు ఎప్పటికప్పుడు యాత్రలోని విశేష విషయాలను ఉత్తరాల ద్వారా తెలియజేస్తూ ఉండేవారు.



**శ్రీ జగద్గురువులు** వానికి తమ సమాధానాలను పంపుతూ ఉండేవారు.
మేము, మీ యాత్రాసమయాలలో, అనేక సంస్థలు శిష్యుల ప్రయోజనాలకోసం రూపొందుతున్నాయని తెలుసుకొని సంతోషిస్తున్నాము. గొప్ప ధార్మిక కార్యాలు, ఉత్సవాలు జరుగుతున్నాయని తెలుసుకుని ఆనందిస్తున్నాము.



పరమపూజ్య శ్రీ సన్నిధానమువారు, ఉత్తమ శిష్యుడు గురుదేవులను అనుసరించి ఆచరించవలసిన సదాచారాలను మిక్కిలి శ్రద్ధతో చిత్తశుద్ధితో పాటించేవారు. శ్రీజగద్గురువుల, సన్నిధానమువారి మాటలలో ఏకత్వాన్ని భక్తులు గమనిస్తూ ఉండేవారు.



ఒక సందర్భంలో కొందరు పత్రికల వారు శ్రీజగద్గురువులను శ్రీ సన్నిధానము వారిని విడివిడిగా కలుసుకుని విషయ సేకరణ చేశారు. తరువాత వారందరూ ఏకముఖంగా ఇలా అన్నారు. మేము మీలో ఏ ఒక్కరిని కలిసి సంభాషించినా సరిపోయేది. మీరు ఇరువురు ఉపయోగించిన పదజాలంలో కూడా తేడా ఏమీలేదు.



శ్రీ జగద్గురువుల, శ్రీసన్నిధానము వారి ఏకాత్మకతను ప్రశంసిస్తూ సుప్రసిద్ధ సంస్కృతవిద్వాంసుడు శ్రీ మండనమిశ్ర జగద్గురువులతో ఇలా అన్నారు. శ్రీ శంకరులు ఎలా ఉండేవారు? వారి శిష్యులు ఎలా ఉండేవారు ? నేనొక నిర్ణయానికి వచ్చాను. వారు మీ గురుశిష్యులవలెనే ఉండేవారు.



1989 సెప్టెంబరు 21వ తేదీనాడు జగద్గురువులు శ్రీ అభినవ విద్యా తీర్థమహాస్వాములవారు,
పరిపూర్ణ వ్యక్తిత్వానికి నిదర్శనం అయినవారు, తమ పార్థివదేహాన్ని వదలివేశారు.
వీరాసనంలో ఉండి కన్నులు మూసుకొని అనంతపరమాత్మతత్త్వంలో విలీనం అయిపోయారు.



మరునాడు శ్రీవారి పార్థివదేహాన్ని భూస్థాపితం చేసిన తరువాత **పరమపూజ్య గురుదేవులు** సమాధిస్థలంలో పార్థివలింగం పూజను యథావిధిగా ఆచరించారు.



శోకసంతప్త హృదయాలతో నిలిచి ఉన్న జనాలను ఉద్దేశించి పరమపూజ్యులు ఇలా అన్నారు. మన గురుదేవులు మనలను విడిచి ఎక్కడకూ వెళ్ళలేదు. వారు మన హృదయమందిరాలలోనే ఉన్నారు. మనం గాఢంగా భావిస్తే వారు తప్పక మనలను ఆశీర్వదిస్తారు. దర్శనాన్ని కూడా అనుగ్రహిస్తారు. వారి ప్రాభవం మన భావనలకు అందనంత సమున్నతమైనది. శ్రీ సన్నిధానంవారు శ్రీ జగద్గురువుల వైభవాన్ని గురించి రచించిన స్తోత్రాన్ని,అష్టోత్తరశతనామావళినీ శ్రీశారదాపీఠం ప్రావర్తక సచివులు అక్కడ కూడిన వారందరికీ ప్రసాదంగా పంచిపెట్టారు.



1989 అక్టోబరు 19 నాడు పరమపూజ్య శ్రీ భారతీతీర్థమహాస్వామి వారు శృంగేరీ శారదాపీఠం ముప్పది ఆరవ జగద్గురు శంకరాచార్యులుగా పట్టాభిషిక్తులయ్యారు.



పరమపూజ్యులను శారదాపీఠ మహాసచివులు

సగౌరవంగా సకల లాంఛనాలతో శ్రీశారదాంబా మందిర

గర్భాలయానికి తీసుకొనివెళ్ళారు.



ఉదయం 10.30 ప్రాంతంలో శ్రీవారు భక్తులకు దర్శనం ఇస్తారు. వారి సమస్యలను ఓపికతో ఆలకిస్తారు. వారిని ఆశీర్వదిస్తారు. సమస్యలకు పరిష్కారాలు సూచిస్తారు.

---

ప్రతి శుక్రవారము మఠపరిధిలో ఉన్న దేవాలయాలను సందర్శిస్తారు. శ్రీశారదాంబామందిరములో కొంతసేపు గడుపుతారు.

---

మధ్యాహ్నం 12.30 ప్రాంతంలో మాధ్యాహ్నిక స్నానం మాధ్యాహ్నిక అనుష్ఠానం ఆచరిస్తారు. తరువాత శ్రీవారు భిక్షను స్వీకరిస్తారు.

---

భక్తులకు దర్శనం అనుగ్రహించిన తరువాత సాయంకాలం 5.30 ప్రాంతంలో శ్రీజగద్గురువులు సాయం స్నాన, అనుష్ఠానాలను నిర్వర్తిస్తారు. కొన్ని ప్రత్యేక పర్వదినాలలో అనుగ్రహభాషణలు చేస్తూ ఉంటారు.

శ్రీ మహాసన్నిధానము వారి దినచర్య చాలా నియమబద్ధంగా ఏర్పడి ఉన్నది. బ్రాహ్మముహూర్తంలో తెల్లవారు ఝామున నాలుగు గంటలకే మేల్కొనటం. స్నానం, అనుష్ఠానం ముగించటం, శ్రీగురుదేవుల పవిత్ర సమాధిని అర్చించటం, శ్రీవారి ఆలయమందిరాన్ని దర్శించటం మొదలైనవి క్రమం తప్పకుండా సమయపాలన నిష్ఠతో జరిగిపోయేవి. తరువాత కొంతసేపు వేదాది వాఙ్మయాన్ని ఏకాంతంగా అనుశీలిస్తూ ఉంటారు.



సాయంకాలం నాలుగు గంటల ప్రాంతంలో భక్తులనుండి వచ్చిన ఉత్తరాలను
గమనిస్తారు. అవసరం మేరకు మతవిషయాలను కూడా పరిశీలిస్తారు.



రాత్రి 8.30 గం॥లకు పరమపూజ్యస్వామి వారు చంద్రమౌళీశ్వర పూజ చేస్తారు. దీనితో పాటు ప్రతి శుక్రవారము శ్రీచక్రార్చన కూడా చేస్తారు. రాత్రి 11.00 గం॥లకు కొంతసేపు వేదశాస్త్రాదులకు సంబంధించిన గ్రంథాలను అధ్యయనం చేసి విశ్రాంతి తీసుకొంటారు.



పరమపూజ్య జగద్గురువులు శాస్త్రాలలో అత్యున్నత ప్రమాణభూతులుగా విశ్వవిఖ్యాతి గాంచినవారు. వారు ప్రతి సంవత్సరం శృంగేరిలో నిర్వహించే మహాగణపతి వాక్యార్థవిద్వత్సభకు అధ్యక్షస్థానంలో అధివసిస్తారు. భారతదేశం నలుమూలల నుండి వచ్చే శాస్త్రపండితుల వాక్యార్థచర్చల నన్నింటినీ గుణదోషవిచారణాత్మకంగా సమన్వయిస్తూ ఉంటారు.



పరమపూజ్యుల వైదుష్యం మహాపండితులను కూడా సర్వసందర్భాలలో ఆశ్చర్యమగ్నులను చేస్తూనే ఉంటుంది. ఒక సమకాలీన మహాశాస్త్ర విద్వాంసుడు ఒక సందర్భంలో సుదృఢంగా ఇలా ఉద్ఘోషించాడు. పరమపూజ్య ఆచార్యస్వాములు సాక్షాత్తు శ్రీ జ్ఞానసరస్వతి అవతారమే.



పరమపూజ్యస్వామివారు ఎంతగా విరామం దొరకని దినచర్యలో ఉన్నా ప్రాచీన శాస్త్ర వేదాంత  గ్రంథాల తాళపత్రప్రతులనూ, వ్రాతప్రతులనూ, చాలా శ్రమ తీసుకొని, పరీక్షించి పరిష్కరించేవారు. మఠసంబంధమైన పరిశోధనకేంద్రం ద్వారా ప్రకటింపజేశేవారు.



శ్రీవారి గురుదేవుల స్తోత్రాలే కాక జగద్గురువులు అనేక భక్తిప్రధానమైన శ్లోకాలు విరచించారు. అవి పూర్వ జగద్గురువులకు, దేవతామూర్తులకు సంబంధించినవి. అవి అన్నీ మహాప్రభావ సుసంపన్నాలు. పరమ సౌందర్యభరితాలు.



శ్రీజగద్గురు సార్వభౌములు బహుభాషావేత్త. వారు ధారాళంగా సుమధుర సంస్కృతంలో, తెలుగులో, కన్నడంలో, తమిళంలో, హిందీ మొదలైన భాషలలో ప్రసంగిస్తూ ఉంటారు. వారి ప్రసంగాలన్నీ సులభమైన తేజోవంతమైన శైలిలో ఉంటాయి. ఉపదేశక్త్రీర్భితాలై ఉంటాయి. అప్రయత్నంగా సాగిపోతూ ఉంటాయి. ఆ ప్రసంగాలలో జగద్గురువుల ఆదర్శప్రాయమైన వైదుష్యం ఆశ్చర్యకరమైన స్మృతి శక్తి అనేవాని ముద్ర స్పష్టంగా కానవస్తూ ఉంటుంది.



శ్రీవారు న్యాయవేదాంత శాస్త్రాలను అనేక పర్యాయాలు బోధించారు సాధారణంగా ఒక శాస్త్రం బోధించటానికి అనేక సంవత్సరాలు పడుతుంది. విజయయాత్రలలో సమయం చిక్కించుకోవటం కష్టమైనా, ప్రత్యేకించి శాస్త్రవిషయం అత్యంత క్లిష్టమైనదైనా శ్రీవారు పాఠబోధనను కొనసాగిస్తూనే ఉండేవారు. అది కూడా క్రమ భంగానికి ఏవిధమైన ఆస్కారమూ లేకుండా శాస్త్రాలపట్ల వారికున్న విలువలతో కూడిన దృక్పథం చాలా గొప్పది.

శ్రీవారు ఎంత సంక్లిష్టమైన విషయానికి సంబంధించిన వాక్యసముదాయాన్నైనా, అలవోకగా, సూటిగా పట్టుకొంటారు. అది గమనించి శ్రోత ఆ గ్రంథభాగాన్ని శ్రీవారు అప్పుడే చూస్తున్నారు అనుకొని ఆశ్చర్యంలో తలమున్కలైపోతారు.



**పరమపూజ్య గురుదేవులు** అతిక్లిష్టమైన వేదాంతవిషయాల పండితులకు సలక్షణంగా, సాధారణులకు అతిసులభంగా బోధిస్తూ ఉంటారు. రెండు ధోరణులలోను సత్యధోరణికి ఏ మాత్రమూ భంగం ఉండదు.  ఒక భక్తుడు ఒకమారు శ్రీజగద్గురువులను ఇలా అడిగినాడు. **మహాస్వామివారూ!** భగవంతుడు పక్షపాతి, క్రూరచిత్తుడూ కాదా ! ఎందుకంటే కొందరిని దు:ఖాలపాలు చేస్తాడు. మరికొందరిని సుఖసంతోషాలలో ముంచెత్తుతూ ఉంటాడు. **శ్రీజగద్గురువులు** అతనికి ఇలా తెలియజెప్పారు. ఇద్దరు సేద్యగాండ్ర పొలాలలో వాన ఒకే విధంగా కురిసిందనుకోండి.



ఆ యిద్దరిలో ఒకడు మంచి ఉత్సాహంతో, ప్రయత్నంతో వ్యవసాయం చేస్తాడు. గొప్పపంటను పండిస్తాడు. మరొకడు చేతులు కట్టుకొని కూర్చున్నాడు. వాని క్షేత్రంలో పంట పండదు గదా!



ఇప్పుడు మీరు, వర్షం కష్టపడి పనిచేసిన కృషీవలుని విషయంలో పక్షపాతంగా వ్యవహరించిందని నిందిస్తారా? లేదుకదా ! వర్షంలాగేనే దేవుడు కూడా పక్షపాతం లేనివాడే. ఉత్తమ న్యాయమూర్తిలాగా వారు వారు చేసిన కర్మములను బట్టి కొందరిని ప్రోత్సహిస్తాడు. కొందరిని శిక్షిస్తాడు.



మరొక భక్తుడు ఇలా అడిగాడు. మహాగురుదేవా! దేవుడు మనముందు ఆకారంతో సాక్షాత్కరిస్తాడా? శ్రీజగద్గురువులు ఇలా చెప్పారు. కొందరు సాధుపుంగవులు అహోరాత్రాలు భగవంతుని మూర్తిని ధ్యానం చేశారు. వారికి మూర్తిస్వరూపంతో సాక్షాత్కరించాడు. మనం మన కోరికలను తుడిచి వేసికొని చిత్తశుద్ధితో ప్రయత్నించి దైవస్వరూపాన్ని హృదయంలో నిలుపుకోగలిగితే భగవంతుణ్ణి మనం కూడా దర్శించుకోవచ్చు. తమరు ఆదేశించినట్లే నా ప్రవృత్తిని సరిదిద్దుకుంటాను.



ఒక భక్తుడు **శ్రీజగద్గురువుల** ముందు తనగోడు ఇలా వెళ్ళబోసుకున్నాడు. నిరంతరం భగవంతుణ్ణి గూర్చియే భావిస్తున్నా, నా సమస్యలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. ఇంకా ఇంకా అల్లుకుని పోతున్నాయి.



**శ్రీ జగత్గురువులు :** ఒక వ్యక్తి మనస్సు నిరంతరం భగవంతునికి అభిముఖంగా ఉంటే, సాంసారికసమస్యలు పరిష్కరింపబడకపోవటం సంభవిస్తుందా?



కంగారుపడకు. నీకు కలుగుతున్న చిక్కులన్నీ భగవంతుడే
కల్పిస్తున్నాడనుకో! ఆదేవుడే ఈ సమస్యలనన్నింటినీ
తొలగించుకోగల శక్తిసంపదను ప్రసాదిస్తాడనే
దృఢవిశ్వాసాన్ని పెంపొందించుకో!



ఒక దంపతులు శృంగేరిని దర్శించుకొన్నారు. వారిలో భార్య స్వామివారితో ఇలా మొరపెట్టుకొన్నది. నేను పెద్దకుటుంబాన్ని నిర్వహించుకోవాలి. కనుక ప్రశాంతంగా కూర్చుని దైవాన్ని ప్రార్థించటానికి నాకు తీరిక చిక్కడం లేదు. నేను దు:ఖంతో కుమిలిపోతున్నాను. మహాస్వామీ! దీని నుండి నేను బయటపడగలనా?



శ్రీ జగద్గురువులు ఇలా అన్నారు. తప్పకుండా! మీకు భగవదర్శనకు గొప్ప అవకాశం లభించినదని నాకు అనిపిస్తున్నది. నీ హృదయపద్మంలో ఎల్లవేళలా శారదాంబ నెలకొని ఉన్నదని సంభావిస్తూ ఉండు. ఉదయం నిద్ర నుండి లేచినప్పుడు నీవు ఆ తల్లికి సుప్రభాతం పాడుతున్నావనుకో, భోజనానికి కూర్చున్నప్పుడు నీవు ఆ తల్లికి తినబోతున్న దానిని నివేదించు. నీ గృహకృత్యాలను చేసుకొంటున్నప్పుడు ఆ జగన్మాత నీతో పాటే ఉందనుకో.



సమయం కుదిరినప్పుడు కన్నులు మూసుకొని అమ్మవారికి మానస పూజ చేయండి. మీ సమస్యలన్నింటినీ అమ్మవారికి విన్నవించుకోండి. ఆమె మార్గదర్శనాన్ని అభ్యర్థించండి. ఈ మార్గంలో అమ్మ అనుగ్రహాన్ని పరిపూర్ణంగా మీరు పొందుతారు.




ఒక భక్తుని గృహంలో పాదపూజ జరుగుతున్నది. నైవేద్యం తెచ్చినప్పుడు **శ్రీజగద్గురువులు** పదార్థం చాలా వేడిగా ఉందని గమనించారు. అతి సాధారణంగా తమ వద్ద ఉన్న పంకాను ఆ నివేదన పదార్థం వైపు త్రిప్పారు.



నైవేద్య పదార్థం పంకాగాలితో కొంచెం చల్లబడినప్పుడు శ్రీమహాసన్నిధానంవారు శ్రీలలితాసహస్రనామంలోని ఒక నామాన్ని వివరించారు.



ఆ భక్తుడు తరువాత శ్రీస్వామివారితో అన్నాడు. పరమపూజ్యస్వాములవారు అమ్మవారికి చాలా వేడిగా  ఉన్న పదార్థాన్ని నివేదించకుండా మమ్ములను నిలువరించారు. అంతేకాదు మా తప్పిదాన్ని ఇతరులకు తెలియకుండా మమ్ములను సరిదిద్దారు.



**శ్రీ స్వామివారి** దృష్టిలో పూజలందుకొంటున్న విగ్రహాలు కేవలం ఆచేతనపదార్థాలు కాదు. పూజ చేస్తున్నప్పుడు మనం, పూజలందుకొంటున్న దేవతావిగ్రహం చైతన్యసంభరితమైనదిగా సంభావించాలి  అని శ్రీవారు వక్కాణించారు.



ఒక వ్యక్తి శ్రీజగద్గురువులతో మాట్లాడుతున్నారు. శ్రీ గురుదేవా! నేను నా విధులనన్నింటినీ నెరవేర్చుకొన్నాను. నాకు ఇప్పుడు సంతోషంగా ఉన్నది. నేను సమృద్ధిగా ధనం సంపాదించాను. నేను సంపాదించిన మొత్తంలో గణనీయమైన భాగం నా భార్య పేరున, నా పిల్లల పేరున పెట్టాను.



**శ్రీ జగద్గురువులు** మీరు మీకోసం ఏమి మిగుల్చుకొన్నారు.

భక్తుడు - నా పేరున కూడా కొన్ని ఆస్తులు,

ధనపునిలువలు ఉన్నాయి.



శ్రీ స్వామివారు – మేము నీ ప్రాపంచిక సంపదను గూర్చి అడగటం లేదు. ప్రతివ్యక్తీ తప్పనిసరిగా ప్రాణప్రయాణ సమయంలో ఈ సంపదనన్నింటినీ వదిలివేయవలసినదే కదా! అయితే గురుదేవా! నాకోసం నేను దేనిని సంపాదించి పెట్టుకోవాలి?



**గురుదేవులు** ఇలా బోధించారు.  మీరు పుణ్యాన్ని కూడబెట్టుకోవాలి. అది కేవలం ధర్మశాస్త్రాలు విధించిన కర్తవ్యాలను శ్రద్ధతో ఆచరించటం ద్వారా, అవసరంలో ఉన్నవారిని ధనాదులతో ఆదుకోవటం ద్వారా పెంపొందుతుంది. నిజానికి అదే నిజమైన సంపద. దానిని ఇతోధికంగా రాబట్టుకోండి.

**శిష్యుడు :** తమరు నా కళ్ళు తెరిపించారు **గురుదేవా!** ఇకపైన మీ ఆదేశం ప్రకారమే చేస్తాను.



జగద్గురువులు ఒక అనుగ్రహభాషణంలో ఒక శ్లోకాన్ని ఉదాహరిస్తూ ధర్మం ఎలా మానవునకు ప్రయోజనకరం అవుతుందో తెలియజెప్పారు. " యాన్తి ధర్మ ప్రవృత్తస్య తిర్యఞ్చోపి సహాయతామ్, అపన్థానం తు గచ్ఛన్తం సోదరో పి విముఞ్చతి" పశువులు, పక్షులు కూడా ధర్మప్రవర్తన కలవానికి తోడ్పడతాయి. కాని అధర్మమార్గంలో ప్రవృత్తి కలవానిని సోదరుడు కూడా వదలివేస్తాడు.



వానరాలు కూడా శ్రీరామచంద్రునకు సాయం చేశాయి.



శ్రీరాముని శరణాగతికై నిశ్చయించుకొన్న విభీషణుడు అధర్మప్రవృత్తికల అన్నను రావణుని వదలివేశాడు.



ఒక శిష్యునికి **శ్రీవారు** ఇలా సూచన ఇచ్చారు. కొందరు భగవంతునికోసం కొద్దిపాటి సమయం కూడా వినియోగించలేకపోతున్నాం – అంటారు. దానిని మేము ఒప్పుకోము. వారికి ఇతరమైన ఏపనికైనా సమయం దొరుకుతుంది. ప్రతిదినం కొన్ని నిముషాలైనా **భగవంతుణ్ణి** భావిస్తూ ఉండండి. ఎంత మనశ్శాంతి కలుగుతుందో ఎంత హాయిగా ఉంటుందో మీరే చూస్తారు. మీ పిల్లలు మంచి పనులకు అలవాటు పడాలని మీరు భావిస్తే, ఆ మంచిపనులు ముందు మీరు ఆచరించండి. మీ పిల్లలకు మీరు ఆదర్శప్రాయులు కావాలి.



ఒక భక్తుడు జగద్గురువులను వినయపూర్వకంగా ఇలా అడిగాడు. **గురుదేవా!** నాకు అతి శీఘ్రంగా చిరాకు కలుగుతూ ఉంటుంది. అది ఆవేశించినప్పుడు నాకు ఒళ్ళు తెలియదు. ఈ విషయంలో **శ్రీ గురుదేవులు** నాకు చక్కని దారి చూపాలి.

**శ్రీ గురుదేవులు :** కోపం ఆశ్రయించినవానినే మట్టుపెడుతుంది. ( అగ్ని కెట్టెనువలె ). మనం దానిని అభ్యాసంతో రూపుమాపుకోవచ్చు. ఇటుపైన కోపం వస్తున్నదన్న సూచన రాగానే హృదయపూర్వకంగా పెద్దగా నవ్వండి.



ఈ ఆచరణాత్మకమైన జగద్గురువుల బోధనకు సంబంధించిన ఉపాఖ్యానం ఒక పుస్తకంలో ప్రచురితమైనది. ఒక దుబాయ్ యాత్రికుడు అనుకోకుండా ఈ గ్రంథాన్ని చూడటం సంభవించింది. తోటి ప్రయాణికుడు దానిని విమానంలో పొరపాటున వదలిపెట్టి ముంబైలో దిగిపోయాడు. ఆ మొదటి ప్రయాణికుడు అందులోని విషయాలను చదివాడు.




ఆ వ్యక్తి తరువాత శ్రీ శారదాంబ మఠానికి దుబాయి నుండి ఉత్తరం వ్రాసాడు

దుబాయ్ 15-3-2003

పరమపూజ్య మహారాజ్! కోపాన్ని అదుపులో పెట్టుకోవటం గురించి తాము ఇచ్చిన సూచనను నేను పాటించాను దానివలన ఒక ఘోరమైన విపత్తు తప్పిపోయింది. నా వ్యాపారభాగస్వామీ నేను తీవ్రకోపంతో వాదులాడుకొన్నాము. మహారాజులవారు నా జీవితాన్ని ఆరోజున కాపాడినారు.



ఒక డాక్టరు శృంగేరికి వెళ్ళాడు. " శ్రీజగద్గురువులతో తాను ఇటీవల స్వంతంగా ఒక చికిత్సాలయాన్ని ప్రారంభించానని విన్నవించుకొన్నాడు.



**గురుదేవులు** - మంచిది. మీ చికిత్సకోసం వచ్చిన వారందరూ పరిపూర్ణమైన ఆరోగ్యం పొందుదురు గాక ! అని ఆశీర్వదిస్తున్నాము. ఆ వైద్యునికి దానితో కొంచెం నిరాశాభావం కలిగింది.



అప్పుడు గురుదేవులు ఇలా వివరించారు. మీ చికిత్సాలయం చాలా లాభదాయకం కావాలని మేము ఆశీర్వదిస్తే, భంగ్యంతరంగా చాలా మంది రోగగ్రస్తులు కావాలని ఆశీర్వదించటమే అవుతుంది కదా ! అందువలన మేము, ఇప్పుడు చెప్పిన ఆశీర్వాద విధానాన్ని ఎన్నుకొన్నాము. పరమపూజ్య జగద్గురువులు భక్తులను ఆశీర్వదించే సమయంలో కూడా హితాభిలాషిగానే ఉంటారు.  ఆ వైద్యుడు శ్రీజగద్గురువుల ఆశీస్సులు తనకూ, తన దగ్గరకు చికిత్సకోసం వచ్చేవారికీ ఉభయులకూ ప్రయోజనాత్మకంగా ఉన్నాయని సంతోషపడ్డాడు.



ఒక భక్తుడు శ్రీజగద్గురువులను భగవంతుని అనుగ్రహవిధానం ఎలా ఉంటుంది – అని అడిగాడు. సరియైన భావనలద్వారానే మానవుడు ఏ ఉద్యమంలోనైనా సాఫల్యం సాధించగలడు. సముచితమైన భావనలను మనస్సులో పుట్టించటంద్వారానే భగవంతుడు మనిషిని అనుగ్రహిస్తాడని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి.



**మరొక సందేహం :** ఆత్మోద్ధరణ పొందటానికి మానవుడు గురువుసన్నిధిలో నిరంతరం ఉంటూ సేవ చేయనక్కర లేదా ?

**సమాధానం :** అక్కరలేదు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీ గురువులు ఏమి ఉపదేశించారో దానిని చిత్తశుద్ధితో ఆచరణలో పెట్టాలి. అది కూడా నీ గురువునకు నీవు చేసుకొనే గొప్ప సేవ అవుతుంది.



## వేదాలు, ముక్తి - గురించి

**గురుదేవా ! అద్వైతులు బ్రహ్మము తప్ప తక్కినదంతా మిథ్య - అసత్యము అంటారు కదా ! అప్పుడు వేదాలు కూడా అసత్యములే కావాలి కదా ! వేదాలు అసత్యాలైతే వానినుండి యధార్థజ్ఞానం ఎలా కలుగుతుంది.?**



శ్రీ జగద్గురువులు – ఈ కథ వినండి. ఒక వ్యక్తి తాను తిన్న ఆహారం విషపూరితమైనది అనే భావనతో అతలాకుతలం అయి పోతున్నాడు. నిజానికి అది విషమిశ్రితం కాదు.



**అతని మానసికాందోళన ఎంత తీవ్రమైనదంటే, ఆ ఆలోచనతో అతడు కుప్పకూలి చనిపోయాడు.ఊహించుకొన్న విషం నిజమైన మరణానికి దారితీసింది. అదే విధంగా నిత్య సత్యందృష్టితో వేదాలు పరమసత్యాలు కాకపోయినా, విముక్తి మార్గాన్ని ప్రకాశవంతంగా చేస్తాయి.**



ప్రపంచం అసత్యం అనే విషయాన్ని గురించి.

శ్రీ గురుదేవా! మనం ప్రపంచాన్ని చూస్తున్నాం. మనుష్యులతో వ్యవహరిస్తున్నాం. కానీ అద్వైతం ప్రపంచం అసత్యం అని చెప్తున్నది. దీనిని ఎలా అర్థం చేసుకోవాలి?



విశ్వం కంటికి కనిపిస్తున్నది కనుక ' అసత్తు ' కాదు అంటే కేవలం లేనిది కాదు, కుందేటి కొమ్ములాగా. అలా అని బ్రహ్మము లాగా కేవలం సత్తు కాదు. ఏది సత్యమో దానికి వికారాలూ, వినాశమూ ఉండవు. ప్రపంచం అటువంటిది కాదు. అందువలన ప్రపంచము సత్యమూ కాదు, అసత్యమూ కాదు. వ్యావహారిక సత్యము మాత్రమే అని మేము చెప్తాము. ప్రపంచం వ్యావహారికసత్యం అన్నంత మాత్రాన బ్రహ్మములాగా, స్వతంత్రము కాదు. పరమసత్యాన్ని తెలుసుకొన్నప్పుడు, ద్రష్ట ప్రపంచాన్ని మరొక సత్యతత్వంగా చూడడు. అప్పుడు బ్రహ్మమే ఇదంతా అనే జ్ఞానం కలుగుతుంది.



**జగద్గురువులు** ప్రతిసంవత్సరం జరిగే విద్వత్సదస్సులలో అప్పుడప్పుడే వికసిస్తున్న విద్వాంసులను ప్రోత్సహిస్తూ ఉంటారు. శ్రీవారు అట్టివారిని, పొరపాటు దొరలినప్పుడు సుకుమారంగా సరిదిద్దుతూ ఉంటారు. అంతేకానీ మనస్సులో నొచ్చుకొనేట్లు చేయరు.



పరమపూజ్య జగద్గురువులు కొన్ని సందర్భాలలో సుకుమారమైనా హాస్యాన్ని పదచమత్కారాలను యుక్తి యుక్తంగా ప్రయోగిస్తూ ఉంటారు. సరియైన దానిని నిరూపించి సరిచేసి, ఉపదేశాత్మకంగా తెలియజేస్తారు. ఒకప్పుడు ఒక యువకుడు ఉత్సాహాతిశయంతో జగద్గురువుల దగ్గరకు వచ్చాడు. మహాస్వామీ ! నేను సంస్కృతంలో తమపై ఒక శ్లోకం రచించాను. కానీ దానిలో వ్యాకరణదోషాలు ఉండవచ్చునేమో అని భయంగా ఉంది.



శ్రీవారు అతని శ్లోకాన్ని పరిశీలించారు. అందులో చాలా విభక్తి దోషాలుండటం గమనించారు. నీకవిత్వంలోని విభక్తి దోషాలను గూర్చి విచారించకు. మాకు కావలసినది నీ భక్తి మాత్రమే. ఇలా  అంటూ జగద్గురువులు ఆ యువకుని ఆశీర్వదించారు.



ఒక వ్యక్తి తాను చేసిన తప్పునకు పశ్చాత్తాపపడుతూ శ్రీ జగద్గురువులకు క్షమాపణ చెప్పుకొన్నాడు. గురుదేవా ! నా అనుచితప్రవర్తనను హృదయంలో పెట్టుకోకండి. అని ప్రార్థించాడు. శ్రీ జగద్గురువులు అతనిని ఇలా సముదాయించారు. మేము శ్రీ ఆదిశంకరులు బోధించిన దాని సారాన్ని మాత్రమే హృదయంలో పెట్టుకొంటాము. మేము ఇంకొకదానిని దేనినీ హృదయంలో ఉంచకోము. విచారపడకు.



ఒక ఆధ్యాత్మిక జిజ్ఞాసువు ఉత్తరభారతంనుండి శృంగేరికి వచ్చాడు. తన సాధన విషయంలో అతనికి ఒక సందేహం ఉన్నది. దానిని జగద్గురువులకు విన్నవించు కోవాలని అతని కోరిక. కానీ, అతని సంకోచ స్వభావం వలన ఆపని చేయలేకపోయాడు. శ్రీజగద్గురువుల ఉపన్యాసం ఒకటి సాగుతున్నది. శ్రీజగద్గురువుల దర్శనం నాలుగురోజులుగా లభించినా నేను నా సందేహాన్ని శ్రీవారికి నివేదించుకోలేక పోయాను. ఈ రాత్రికి నేను శృంగేరినుండి బయలుదేరాలి. నేనొక సువర్ణావకాశాన్ని కోల్పోయాననుకొంటున్నాను.



గురుదేవుల ప్రసంగం ఆ వ్యక్తికి పరిచయంలేని కన్నడభాషలో సాగుతున్నది. శ్రీగురుదేవులు అతనివైపు తిరిగి చిరునవ్వుతో ఒక సంస్కృత శ్లోకం ఉచ్చరించారు.



శ్రీ జగద్గురువులు ఉదాహరించిన శ్లోకంలో అతని సమస్యకు పరిష్కారం లభించింది. నిజానికి అతడు తన సందేహాన్ని మాటలలో పెట్టలేకపోయాడు. అయినా జగద్గురువులు అతని సందేహానికి పరిష్కారం చెప్పారు. ప్రసంగం అయిపోయిన తరువాత తనకు పరిచయమైన ఒక వ్యక్తితో అతడు తన అనుభవాన్ని పంచుకున్నాడు. నేను అనుగ్రహింపబడ్డాను. శ్రీ మహాసన్నిధానం వారు నా సమస్యకు పరిష్కారం తెలియజేశారు. నేను శృంగేరిని దర్శించుకోవటం సఫలమైనది. ఆ వ్యక్తి – నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక్కడ ఇటువంటి సంఘటనలు చాలా సంభవిస్తూ ఉంటాయి.



శ్రీ జగద్గురువులు చిన్నపిల్లలతో చాలా సరదాగా ఉంటారు. వారిని అనుగ్రహిస్తారు.  ఒరే ! నీకీపండు కావాలంటే నీవు ఒక శ్లోకం చదవాలి. చదివితే నీకీపండు ఇస్తాము.




వికలాంగులను, మానసిక స్వస్థత లేనివారినీ శ్రీవారు ప్రత్యేకంగా
అనుగ్రహిస్తూ ఉంటారు. వారికి అవసరమైన పరికరాలను
అందజేస్తూ ఉంటారు.



శ్రీవారి ఆశీస్సులకోసం, చేయూతకోసం, మార్గదర్శనం కోసం ప్రతిదినం వేలకొలదిగా జనాలు వస్తూ ఉంటారు. వారు అందరినీ అనుగ్రహిస్తారు. అణుమాత్రమైనా అహంకారం ఉండదు. పైగా జనాలు తమ ప్రార్థనలు శ్రీవారి దయవలన సఫలమైనాయి అని నివేదించుకొంటే – అదంతా శ్రీశారదాంబవారి అనుగ్రహం. ఇందులో మేము చేసింది ఏమీ లేదు – అంటారు.



1. కేవలం తమ మార్గదర్శనం వలనా, అనుగ్రహం వలనా నా ఆధ్యాత్మిక ప్రవృత్తి పురోభివృద్ధిసాగిస్తున్నది.
2. శ్రీవారు మా అమ్మాయి వివాహ విషయంలో ఆశీర్వదించారు. మాకు మంచి సంబంధం లభించింది.
3. మహాస్వామివారూ ! క్రిందటి సంవత్సరం తమరు నా కుమారుని ఆశీర్వదించారు. వానికి మంచి మార్కులు వచ్చాయి. వైద్యకళాశాలలో ప్రవేశం పొందాడు.
4. గురుదేవా ! నా భర్తకు శస్త్రచికిత్స అక్కరలేదని డాక్టరు చెప్పారు. తమరు ఆమాట మాకు ముందే చెప్పి ఉన్నారు.
5. గురుదేవా ! తమరు క్రిందటి సంవత్సరం మీ గ్రామం సర్వవిధాలా విరాజిల్లుతుంది. మీ దేవాలయ ప్రతిష్ఠ చక్కగా జరుగుతుంది – అని చెప్పారు. మీ మాటలు నిజమయ్యాయి.
6. మహాస్వామి వారి అనుగ్రహంవలన చేపలవాండ్ల మైన మేము సుఖంగా బతుకుతున్నాము.
7. మహాస్వామి వారు! మీ అనుగ్రహంతో మా ఆర్థిక సమస్యలన్నీ తొలగిపోయాయి.
8. మహాస్వామి! మీ కరుణాకటాక్షం వలన మా కుమారుడు ఒక సుసంపన్నమైన ఉద్యోగం పొందాడు.
9. గురుదేవా! కేవలం మీ అనుగ్రహంవలననే మేము మొత్తం భగవద్గీత కంఠస్థం చేసుకొన్నాము. ఇప్పడు తమ సన్నిధిలో పఠిస్తాము.
10. పరమపూజ్య గురుదేవా! చాలాకాలం సంతానం లేని మా అమ్మాయి, మీ ఆశీస్సులతో ఇప్పడు గర్భవతి అయినది.



గోవులు, ఏనుగులు, లేళ్ళు మొదలైనవి కూడా శ్రీమహాస్వామి వారి మనస్సును ఆకర్షిస్తూ ఉంటాయి. వారి దయను పొందుతూ ఉంటాయి. శ్రీవారి సంరక్షణలో సుఖంగా జీవిస్తూ ఉంటాయి. శ్రీవారి ఆదేశాలమేరకు భారతదేశంలో శృంగేరీతో పాటు అనేక ప్రదేశాలలో పెద్దసంఖ్యలో గోవులు, సుశిక్షితమైన సంరక్షణ, నిర్వహణగల గోశాల లలో సుఖంగా బ్రతుకుతున్నాయి.









అప్పుడప్పుడూ శ్రీజగద్గురుస్వాములు మఠంలోని ఏనుగులకు పండ్లూ ఇతర ఆహారపదార్థాలూ స్వయంగా అందిస్తూ ఉంటారు. ఒకమారు ఒక మఠం ఏనుగు హఠాత్తుగా జబ్బుపడింది. కదలలేకపోయింది. మావటివాని, ఇతరుల ప్రయత్నాలేవీ ఫలించలేదు. మఠం ఉద్యోగులు ఈ విషయాన్ని శ్రీపరమపూజ్య జగద్గురువులకు తెలియజేశారు. వెంటనే శ్రీస్వామి కొన్ని క్షణాలు కళ్లుమూసుకొని ధ్యానంలో ఉండి, తరువాత ఇలా అన్నారు. ఈ ప్రసాదాన్ని తీసుకొనివెళ్ళి ఆ ఏనుగు కుంభస్థలం మీద మెల్లగా అద్దండి. పవిత్రప్రసాదం ఏనుగు నుదుట అద్దిన వెంటనే జబ్బుపడిన ఆ మదగజం మెల్లగా నడవటం ప్రారంభించింది. అక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందించారు. ఏనుగు సంరక్షకుడు శ్రీస్వామివారి దగ్గరకు వచ్చాడు. శ్రీగురుదేవా! మీ అనుగ్రహం, ఏనుగు కదలికలను మామూలు స్థితికి తీసుకొని వచ్చింది. మేము ఏమీ చికిత్స చేయలేదు. మేము కేవలం శ్రీఆంజనేయస్వామి వారిని, ఆ ప్రాణికి అవసరమైన శక్తిని ప్రసాదించమని ప్రార్థించినాము. ప్రభువు మా ప్రార్థనలను మన్నించారు అంతమాత్రమే.



1. పీఠాధిపతులుగా వారు చేసిన మొదటి విజయయాత్ర 1991 నవంబరు నుండి 1992 ఫిబ్రవరి వరకు సాగింది. ఆ విజయయాత్ర కర్ణాటక రాష్ట్రంలో కొన్ని భాగాలను, కేరళ, తమిళనాడు రాష్ట్రాలను పరచుకొని సాగింది.
2. పీఠాధిపతులుగా వారు చేసిన మొదటి విజయయాత్ర 1991 నవంబరునుండి 1992 ఫిబ్రవరి వరకు సాగింది. ఆ విజయయాత్ర కర్ణాటక రాష్ట్రంలో కొన్ని భాగాలను, కేరళ, తమిళనాడు రాష్ట్రాలను పరచుకొని సాగింది.
3. 1992-93లలో రెండవ విజయయాత్ర కర్ణాటక, ఆంధ్రప్రదేశములను కలుపుకొని మహారాష్ట్ర వరకు సాగింది.
4. 1994-95 సంవత్సరాలలో శ్రీజగద్గురువులు అఖిలభారత విజయయాత్ర చేశారు. అది కాశ్మీరము నుండి కన్యాకుమారి వరకు పరచుకొని సాగింది.
5. 2001 లో శ్రీజగద్గురువులు రామేశ్వరంలోని రామనాథస్వామి దేవాలయం మహాకుంభాభిషేక కార్య క్రమంలో పాల్గొనటానికి విజయయాత్ర చేశారు.
6. 2007 ఏప్రిల్ నుండి నవంబరు వరకు జరిగిన విజయయాత్రలో శ్రీపరమపూజ్య పీఠాధిపతులు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రదేశములను తమ పాదస్పర్శతో పవిత్రం చేశారు.
7. 2010లో శ్రీజగద్గురువులు. ఒక నెలరోజులపాటు కాలడీ పరిసరప్రాంతాలలో విజయయాత్ర చేశారు.
8. 2012-13 సంవత్సరాలలో జగద్గురువులు కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ రాష్ట్రాల లలో విజయయాత్ర గావించారు.
9. 2017లో శ్రీవారి విజయయాత్ర కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల లో జరిగింది.
10. రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, గవర్నర్లు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులు, వేరువేరు విశ్వాసాలకు సంబంధించిన నాయకులు, వేరువేరు సిద్ధాంతాల ప్రవక్తలు - పెక్కండ్రు విజయయాత్రలలోను, వారు శృంగేరికి వచ్చినప్పుడూ శ్రీజగద్గురువులను దర్శించుకొంటారు.

**1989 లో పీఠాధిపతి గా బాధ్యతలు స్వీకరించిన తరువాత శ్రీపరమపూజ్య గురుదేవులు ఎనిమిది పెద్ద విజయయాత్రలను నిర్వహించారు. ఆవిధంగా చాలా పెద్దయెత్తున ధర్మోద్ధరణకార్యక్రమానికి పూనుకొన్నారు. అనేక దేవ మందిర ప్రతిష్ఠలను చేయించారు.**





శ్రీ జగద్గురువుల పీఠాధిపత్య కాలపరిధిలో మహాప్రతిష్ఠాత్మకమైన సంఘటనలు ఎన్నో జరిగాయి. శృంగేరీ శారదామఠానికి సంబంధించి, ఇతర ప్రదేశాలకు సంబంధించిన అనేక ప్రణాళికలతో ప్రజలు గొప్ప ప్రయోజనం పొందారు. 1990లో తుంగానది మీద చాలా ఆకర్షణీయమైన వంతెనను వారు ప్రారంభోత్సవం చేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలురు, ఆ నిర్మాణానికి ప్రణాళికవేసి పర్యవేక్షించినవారూ, తమ గురువులూ అయిన శ్రీ అభినవవిద్యాతీర్థుల స్మారకంగా దానికి శ్రీవిద్యాతీర్థ సేతువు అని నామకరణం చేశారు. అత్యంత సముచితమైన ఉపాయనంగా శ్రీజగద్గురువులు ఒక మహాసుందరమైన అధిష్ఠానాన్ని తమ గురుదేవులకు శృంగేరిలో, 33వ 34వ పీఠాధిపతుల మందిరాలకు ప్రక్కన నిర్మింపజేశారు. 1993 లో శ్రీవారు దానికి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు.



1996లో పవిత్రమూర్తులు **శ్రీజగద్గురువులు** చిత్రసుందరమైన కాలభైరవగిరి మీద నూతన వేదపాఠశాలా భవనాన్ని నిర్మింపజేశారు.



**1999లో శ్రీవారు శారదాంబవారికి బంగారురథం సమర్పించారు. రెండేండ్ల తరువాత, అమ్మవారి ఆలయం గర్భమందిరం వెండితలుపులను బంగారువాకిళ్ళుగా మార్పించారు. గర్భాలయం లోపలిగోడలకు సువర్ణపు రేకులు తాపడం చేయించారు.**



1999లో **శ్రీవారు**, వేలకొలదిగా **శృంగేరికి** వచ్చే భక్తుల సౌకర్యంకోసం అతిబృహత్ భోజనశాలను, దానికి సర్వవిధాలా సరిపోయే పాకమందిరాన్నీ నిర్మింపజేశారు. పదివేలమందికి పైగా పాఠశాల విద్యార్థులకు ప్రతిదినము దీని నుండి మధ్యాహ్న భోజనం పంపిస్తారు.



2001 లో శ్రీజగద్గురువులు శ్రీ శంకర అద్వైత పరిశోధన కేంద్రాన్ని శృంగేరిలో స్థాపించారు. శ్రీవారి నిర్దేశానుసారం ఆ కేంద్రం శాస్త్రగ్రంథాల ప్రచురణలను చేపట్టటం మొదలైన కార్యాలను చేస్తున్నది. అందులో ఒక పెద్ద వ్రాతప్రతుల గ్రంథాలయం ఉన్నది.



2003లో శ్రీజగద్గురువులు 'గురునివాసము' ను ప్రతిష్ఠించారు. అది శ్రీవారి ఆవాసమందిరం. దానికి సంబంధించిన అత్యంత విశాలమైన మహాశాలలో భక్తులు శ్రీవారిని దర్శించుకొంటారు. శ్రీవారు అనుష్ఠించే శ్రీ చంద్రమౌళీశ్వరారాధనా కార్యక్రమాన్ని తిలకిస్తారు.



2006లో శ్రీ జగద్గురువులు గీతాజ్ఞాన యజ్ఞపథకమును ప్రారంభించారు. వారి నిర్దేశం ప్రకారం, భగవద్గీత 18 అధ్యాయాలను స్మృతిశక్తితో అప్పగించే వ్యక్తులకు శ్రీవారు ధనరూప పురస్కారాన్నీ, ప్రమాణపత్రాన్నీ అనుగ్రహిస్తారు. ఆ పురస్కారగ్రహీతలను ఆశీర్వదిస్తారు. చివరి ఆవృత్తంలో శ్రీవారే స్వయంగా పరీక్షను నిర్వహిస్తారు.



2007లో శ్రీపరమపూజ్య గురుదేవులు
భగవాన్ వేదవ్యాస మందిరాన్ని శృంగేరిలోని
నరసింహవనంలో ప్రతిష్ఠించారు.



నాలుగు ఆమ్నాయపీఠాధిపతులైన శంకరాచార్యుల సమావేశం 1993 లో శృంగేరిలో జరిగింది.
అందులో శ్రీ శృంగేరీ శారదామ్నాయపీఠ మహాస్వాములు శ్రీ భారతీతీర్థులవారు, ద్వారక, బదరీ
ఆమ్నాయపీఠాలకు సంబంధించిన శ్రీ స్వరూపానంద సరస్వతీ మహాస్వామి వారు,
పూరీ గోవర్ధన పీఠాధిపతులు శ్రీనిశ్చలానంద సరస్వతీ మహాస్వాములవారు పాల్గొన్నారు.
ఇటువంటిదే మరొక సమావేశం 2007లో బెంగుళూరులో జరిగింది.




శ్రీ ఆదిశంకరుల జన్మస్థలం అయిన కాలడిని 33వ పీఠాధిపతులు పునర్ధర్మించిన శతజయంతి ఉత్సవాలు కాలడిలో 2010లో జరిగాయి. అచటి దేవమందిరాలను శ్రీవారు నవీకరించి ప్రతిష్ఠలు చేయించేరు. కార్యక్రమానికి పూనుకొన్నారు. అనేక ధార్మికసంస్థలను నెలకొల్పారు. అనేక దేవమందిర ప్రతిష్ఠలను చేయించారు.



శ్రీ జగద్గురువులు 2011లో శృంగేరిలోని శ్రీ ఆదిశంకరుల ఆలయాన్ని ఒక మహోజ్జ్వలమందిరంగా నిర్మించి కుంభాభిషేకం జరిపారు.



**2011లో ఒక మహా అయుత చండీయాగం** ( అయుత చండీయాగం – దుర్గాసప్తశతిని 10,000 పర్యాయాలు ఉచ్చరిస్తూ హోమద్రవ్యాలు సమర్పించటం ), శ్రీశారదాపీఠ చరిత్రలో మొట్టమొదటిసారిగా **శ్రీ జగద్గురువులు** నిర్వహించారు. అందులో 1200 పైగా ఋత్విక్కులు పాల్గొన్నారు. మానవ సమాజ సంక్షేమం కోసం శ్రీ అమ్మవారి అనుగ్రహాన్ని ప్రార్థించారు. ఈసందర్భంలో శ్రీజగద్గురువులు ఇలా అన్నారు. మా మహామహిమాన్విత పూర్వాచార్యవరేణ్యులు ఈ మహాకార్యాన్ని చాలా అలవోకగా చేయగల సామర్థ్యం ఉన్నవారు. కానీ, ఆ మహాత్ములు పరమవాత్సల్యంతో దీనిని మాకు అప్పజెప్పారు.




**2014 లో శ్రీజగద్గురువులు అద్వైతశారదను ఆవిష్కరించారు.** అది అంతర్జాల ఆధారితమైన వాఙ్మయ స్వరూపం. దానిద్వారా ఎవరైనా శ్రీ ఆదిశంకరుల వాఙ్మయాన్ని వ్యాఖ్యానాలతోపాటు అధ్యయనం చేయవచ్చు, పరిశోధనలు చేయవచ్చు. అది ఆ వాఙ్మయంలోని ఏపదాన్నయినా సుసూక్ష్మంగా గుర్తించటానికి సహాయపడుతుంది. దానిలో అత్యున్నతమైన సంధానాలు, సమన్వయాంశాలు ఉన్నాయి.



మఠం ప్రవేశద్వారంగా మహోన్నతము మహాతేజోవిరాజితమూ అయిన
రాజగోపురమును 2014 లో దానిని ఉద్ఘాటన చేశారు.



శ్రీతోరణగణపతికి ఒక మందిరాన్ని 2014 లో నిర్మించారు. శ్రీజగద్గురువులు దానికి ప్రతిష్ఠాకార్యక్రమం నిర్వహించారు.



యాత్రికుల సౌకర్యంకోసం మూడు పెద్దవసతి గృహాలు
- శ్రీ శారదా కృప, యాత్రినివాస్, శ్రీ భారతీతీర్థ కృప అనేవి,
ప్రధానంగా సన్యాసుల కోసం తపస్వికుటీరము, వృద్ధుల కొరకు
వృద్ధాశ్రమము - శృంగేరిలో రూపుదిద్దుకొన్నాయి.
శ్రీ పరమపూజ్య గురుదేవులు

 

శృంగేరి, కాలడి, బెంగుళూరు, కొత్తఢిల్లో, ముంబై, చెన్నై మొదలైన ప్రదేశాలలో శ్రీ శారదాపీఠం అనేక విద్యాసంస్థలను నెలకొల్పింది. అలాగే అనేక వేదపాఠశాలలను గూడ ఏర్పాటు చేసింది.

క్రొత్త ఢిల్లీలోని భారతీయ నిర్వహణాధ్యయన సంస్థ, బెంగుళూరులోని జ్ఞానోదయ పాఠశాల.




శ్రీ జగద్గురువులు అభినవవిద్యాతీర్థస్వాములవారు ప్రారింభించి అభివృద్ధి పరచిన
శ్రీ శారదా ధన్వంతరి ధార్మిక వైద్యశాలను శ్రీవారు సంపూర్ణంగా పరిపుష్టం చేశారు.
అలాగే బెంగుళూరులోని ఒక సంయుక్త మహోదాత్త నిర్మాణాత్మకమైన కాన్సర్ వైద్యశాల
– బహుళార్థసాధక వైద్యశాల అనేవి శ్రీశారదామఠ ప్రచోదనతో, భాగస్వామ్యంతో రూపొందినవే.
బెంగుళూరు – రంగదొరై వైద్యశాల. బెంగుళూరు శ్రీ శంకర కాన్సర్ వైద్యశాల, పరిశోధన కేంద్రం.



చెన్నై శ్రీశృంగేరి భారతీ వైద్యాశ్రమం.
శ్రీజగద్గురువుల అనుగ్రహాశీస్సులతో అనేక మహానగరాలలో వైద్యశాలలు
రూపుదిద్దుకొంటున్నాయి.



2015 జనవరి 4న శృంగేరిలో జరిగిన కార్యక్రమంలో
శ్రీజగద్గురువులు శ్రీజగదంబ శారదాంబ అనుమతితో
మేము బ్రహ్మచారి వేంకటేశ్వరప్రసాద్‌ను మా ఉత్తరాధికారిగా
నియమిస్తున్నాము - అని ప్రకటించారు.



శ్రీవేంకటేశ్వరప్రసాద్‌గారు 1993 జులై 24 న జన్మించారు.శ్రీవారి తల్లిదండ్రులు శ్రీమతి సీతానాగలక్ష్మి, శ్రీకుప్పా శివసుబ్రహ్మణ్యఅవధాని గారు భక్తి సంపన్నులు చాలా చిన్న వయస్సులోనే శ్రీ ప్రసాద్‌గారు తమ తాతగారి, తండ్రిగారి అధ్యాపనంలో కృష్ణయజుర్వేదం పదపాఠాన్ని, క్రమపాఠాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేశారు.



శ్రీవేంకటేశ్వరప్రసాద్ 2006 లో శ్రీజగద్గురువుల దర్శనం చేసుకొన్నారు. అది వారిమీద ప్రగాఢమైన ముద్ర వేసింది. తరువాత 2009 లో తిరిగి శ్రీ గురుదేవులను సందర్శించుకొన్న సందర్భంలో శ్రీప్రసాద్ సాష్టాంగ్ దండప్రణామం చేసి చేతులు జోడించి యిలా విన్నవించుకొన్నారు. శ్రీ గురుదేవా! నేను తమపాదాల సన్నిధిలో వేదశాస్త్రాల అధ్యయనం చేయగోరుతున్నాను. శ్రీ స్వాములు - అయితే సరే నీవు ఇక్కడ ఉండవచ్చు, మేము నీకు బోధిస్తాము. అది చరిత్ర పునరావృతం కావటమే.



పరమపూజ్య జగద్గురువులు సలక్షణంగా తమ శిష్యునికి న్యాయశాస్త్రం అధ్యాపనం చేశారు. తరువాత వేదాంతశాస్త్రం కూడా బోధించారు.



తమ శిష్యుని గురబక్తికి వైరాగ్య సంపదకు ఆనందపడి
శ్రీజగద్గురువులు 2015 జనవరి 23న బ్రహ్మచారికి సంన్యాస దీక్షను
అనుగ్రహించారు.



శ్రీమహాసన్నిధానమువారు శ్రీవారికి
ప్రణవమంత్రోపదేశం చేశారు. మహావాక్యాలను
ఉపదేశించారు. శ్రీవారికి విధుశేఖరభారతి అనే
యోగపట్టమును అనుగ్రహించారు.



శ్రీ జగద్గురువులు, సూక్ష్మబుద్ధితో విరాజిల్లే తమ శిష్యునకు న్యాయవేదాంత శాస్త్రాలను మూలముట్టుగా క్షుణ్ణంగా బోధించారు.



**శ్రీశారదాంబామందిర గర్భాలయం మీది భాగంలో నిర్మించిన బంగారు శిఖరానికి పరమపూజ్య గురుదేవులు 2017 ఫిబ్రవరిలో కుంభాభిషేకం గావించారు.**



జగద్గురు శ్రీఅభినవవిద్యాతీర్థ మహాస్వాముల శతజయంతి మహోత్సవాన్ని
2017 అక్టోబరు 18వ తేదీ నాడు జగద్గురువులు నిర్వహించారు.



ఆది శంకరుల నుండి తమ గురువులు శ్రీ అభినవవిద్యాతీర్థ మహాస్వామివారి వరకు
అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న గురుపరంపరను ముందునకు తీసుకొని వెళ్తున్నారు
శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ గురుసార్వభౌములు. వారు గొప్ప ప్రభావం చూపగల సిద్ధపురుషులు. ప్రగాఢమైన
వైరాగ్య సంపత్తి కలవారు, పాపస్పర్శ కూడా లేని ప్రవర్తన గలవారు, సాటిలేని వైదుష్యం కలవారు,
చెక్కుచెదరని సంప్రదాయ సంరక్షకులు. అట్టి శ్రీ భారతీతీర్థ మహాస్వామి వారు శ్రీశారదా పీఠానికి
ముప్పది ఆరవ శంకరాచార్యులుగా ఉండి వేలకొలదిగా భక్తులమీద అనుగ్రహ, ఆశీర్వర్షం కురిపిస్తున్నారు.



మహాసన్నిధానంవారు ఒక ప్రసంగంలో ఇలా భాషించారు. మాకు మంత్రోపదేశం చేసిన తరువాత మా గురుదేవులు మమ్ములను ఆశీర్వదించారు. "మీ పీఠాధిపత్యకాలంలో మఠం అనేకవిధాలుగా సుసంపన్నం అయి విరాజుల్లుతుంది". అని ఇప్పుడు మీరందరూ చూస్తున్న అభివృద్ధి పనులన్నీ కేవలం మా గురుదేవుల ఆశీరనుగ్రహ ఫలితాలే.

# జగద్గురు శంకరాచార్య

# శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహా సన్నిధానమ్

# శృంగేరీ